నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 21 జూన్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో మోడీ దిష్టిబొమ్మ దహనం

కాసిపేట(బెల్లంపల్లి), జూన్ 20 : నీట్‌ను రద్దు చేయాలని కోరుతూ బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ పిలుపు మేరకు మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ ఆధ్వర్యంలో గురువారం బెల్లంపల్లి పట్టణంలో ప్రధాని మోడీ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంటనే నీట్‌ను రద్దు చేయాలి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు ఈట రాకేశ్, సబ్బని అరుణ్, ప్రణీత్, అరవింద్, అరుణ్ ప్రసాద్, కుషల్, సురేశ్, శేఖర్, మహేశ్ పాల్గొన్నారు.

మోడీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

సబ్సిడీ యూరియాను వినియోగించుకోవాలి

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 20 : సహకార సంఘాల ద్వారా అందజేస్తున్న సబ్సిడీ యూరియాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సహకార సంఘం వద్ద యూరియా పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సహకార సంఘాల ద్వారా మాత్రమే ఎరువులను పంపిణీ చేయాలన్నారు. రైతులు డీలర్ల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్, సింగల్ విండో చైర్మన్ అలీబిన్ హైమద్, ఏవో ఖాదర్ హుస్సేన్, ఏఈవో చిరంజీవి, నాయకులు నారా ఆశన్న, మధుకర్, పెంటు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీ ఎరువులు అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కరెంట్ లేక అంధకారంలో మంచిర్యాల పట్టణంలోని అశోక్ రోడ్

కరెంట్ కోతలు.. అడిగితే సాకులు

ఇష్టారాజ్యంగా కరెంట్ కట్.. అష్టకష్టాలు పడుతున్నామంటున్న ప్రజలు

- ప్రతి రోజూ ఇదే తంతు అంటూ మండిపాటు
- అధికారులకు ఫోన్‌లు చేసినా స్పందించడం లేదని ఆవేదన
- తమ కాలనీలకు వస్తే సమస్య చూపిస్తామంటూ సవాల్

మంచిర్యాల, జూన్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా కేంద్రంలో అప్రకటిత కరెంట్ కోతలు విధిస్తుండగా, ప్రజానీకం అష్టకష్టాలు పడుతున్నది. సాయికుంట, శ్రీశ్రీనగర్, రాజరాజేశ్వర కాలనీ, కాకతీయ కాలనీ, తోళ్లవాగు ఏరియా, సున్నం బట్టివాడ (మంచిర్యాల టౌన్-3)లో మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కరెంట్ తీసివేయగా, 'నమస్తే తెలంగాణ'లో 'అంధకారంలో మంచిర్యాల' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సున్నంబట్టివాడ, ఆ చుట్టపక్క ప్రాంతాల వాసులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి తమ కష్టాలను చెప్పుకున్నారు. మంగళవారం ఒక్క రోజే కాదు.. నెల రోజులుగా ప్రతి రోజూ గంట నుంచి నాలుగైదు గంటల పాటు కరెంట్ పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య ఉంటే స్థానిక ఏఈలకు ఫోన్ చేయమని పత్రికల్లో ప్రకటనలు ఇవ్వగా, ఫోన్లు చేస్తే స్పందించడం లేదని, ఒకవేళ ఫోన్ ఎత్తినా ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ ఉందని.. ట్రాన్స్‌ఫార్మర్ ట్రిప్ అయ్యిందని.. చెట్లు నరుకుతున్నామని.. వైర్లు జాయింట్ అయ్యాయని.. జంపర్ సమస్య అని.. ఇలా ఏదో ఒక సాకు చెబుతున్నారంటూ వారు వాపోతున్నారు. ఎలాంటి ఇబ్బందుల్లేకుండా కరెంట్ సరఫరా చేస్తున్నామని గొప్పలు చెబుతున్న అధికారులు.. మా కాలనీలకు వస్తే ఎలాంటి సమస్యలున్నాయో చెప్పడానికి సిద్ధంగా ఉన్నామంటూ సవాల్ విసురుతున్నారు.

ఇష్టం వచ్చినట్లు కోతలు

మంచిర్యాల జిల్లా కేంద్రంలో కరెంట్ కోతలు పెద్దగా లేవని అధికారులు చెబుతుండగా, ప్రతి రోజూ గంట నుంచి రెండు గంటల పాటు కరెంట్ కట్ చేస్తున్నారంటూ ఆయా కాలనీల ప్రజలు ఫిర్యాదు చేస్తుండడం గమనార్హం. పది నిమిషాలు, పావుగంట, అరగంట ఇలా ఇష్టం వచ్చినట్లు కోతలు పెడుతున్నారని మండిపడుతున్నారు. జిల్లా కేంద్రంలో చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. మెరుగైన సేవలు, నాణ్యమైన విద్యుత్‌ను అంతరాయం లేకుండా ఇచ్చేందుకు తీగలు సరి చేయడం, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడం, సబ్ స్టేషన్ల సామర్థ్యం పెంపువంటి పనుల చేస్తున్నామని, అందులోభాగంగానే కరెంట్ నిలిపివేయాల్సి వస్తుందని అధికారులు చెబుతున్నారు. అయితే అనుకున్న సమయానికంటే ఎక్కువగా కోతలు విధిస్తున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. ఆయా ప్రాంతాల్లో ఈ సమయం నుంచి ఈ సమయం వరకు కరెంట్ ఉండదని ముందే ప్రకటనలు ఇస్తున్నా, అంతకు మంచి కరెంట్ పోతుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇష్టారాజ్యంగా కోతలు విధించడం వల్ల తిప్పలు పడాల్సి వస్తున్నదని, ఇకనైనా అధికారులు కరెంట్ కోతలు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎస్ఆర్ఆర్ నగర్‌లో కరెంట్ లేక సెల్‌ఫోన్ లైట్‌లో భోజనం చేస్తున్న ఓ కుటుంబం

మూడు నెలలుగా ఇదే సమస్య

నెల రోజులని కాదు, మూడు నెలలుగా కరెంట్ సమస్య ఉంది. లో ఓల్టేజీ ఉంది ట్రాన్స్‌ఫార్మర్ వేయాలని చెబితే కొన్ని రోజులు ఇబ్బందులు పడ్డాం. 15 రోజుల క్రితం సైతం ఐదారు గంటల పాటు కరెంట్ పోయింది. ఆ రోజూ జంపర్ పోయిందని చెప్పారు. మా కాలనీలో ఏ ఇంటికి వచ్చి అడిగినా ఎన్ని రోజుల నుంచి సమస్య ఉందో చెబుతారు. కరెంట్ సమస్య లేదని విద్యుత్ అధికారులు చెప్పడం సరికాదు. ఏఈ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నా ప్రతిసారి నేను వాట్సాప్ కాల్ చేసి మరీ అడిగేవాడిని. ఇప్పటికైనా అధికారులు సమస్యను పరిష్కరించాలి. **- తిరుపతి, ఎస్ఆర్ఆర్ కాలనీ, సున్నంబట్టివాడ**

రాత్రిళ్లు తీసేస్తే ఎలా

సున్నంబట్టివాడ గణేశ్‌నగర్‌లో ఉంటాం. నిత్యం కరెంట్ కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మంగళవారం ఉదయం 9 గంటలకు పోతే మధ్యాహ్నం 12 గంటలకు వచ్చింది. సాయంత్రం 6 గంటలకు పోతే రాత్రి 12 గంటలకు వచ్చింది. ఇలా ఎట్లాపడితే అట్లా కరెంట్ తీసేస్తే ఎలా. నీళ్ల కోసం తిప్పల అవుతుంది. అసలే వానకాలం. రాత్రిళ్లు కరెంట్ తీసేస్తే పాములు, పురుగులు వచ్చేదెట్లా తెలుస్తది. ఇలా గంటలకొద్ది కరెంట్ తీసేస్తున్నారు. ఇకనుంచైనా సక్రమంగా కరెంటివ్వాలి. **- వినీలా, గణేశ్‌నగర్, చున్నంబట్టివాడ**

సమస్యలన్నీ పరిష్కరించాం

మంచిర్యాల టౌన్-3లో విద్యుత్ సమస్యలన్నీ పరిష్కరించాం. ఇబ్బంది ఉందని తెలియగానే మా సిబ్బంది పోల్ టు పోల్ చెక్‌చేశారు. కొన్ని ప్రాంతాలకు రాత్రి 9.15 గంటలలోపే కరెంట్ ఇచ్చాం. సున్నంబట్టివాడ, అశోక్‌నగర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో సమస్య గుర్తించడంలో కొంత ఆలస్యమైంది. చివరకు డీటీఆర్ దగ్గర లోపాన్ని కనుగొని 12 గంటలకు పునరుద్ధరించాం. మా సిబ్బంది చాలా కష్టపడ్డారు. ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటాం. **- శ్రావణ్‌కుమార్, విద్యుత్‌శాఖ ఎస్ఈ, మంచిర్యాల**

కేసీఆర్‌తోనే కరెంటు బాగైంది..

పరిశ్రమలు, చిరు వ్యాపారాలకు పునరుజ్జీవం పోసింది..

- 2014కు ముందు 8 నుంచి 10 గంటలే కరెంటు ఉండేది..
- కేసీఆర్ వచ్చినంక 24 గంటలు జిగేల్
- పెరిగిన ఉత్పత్తి, కూలీలకు ఉపాధి
- పరిశ్రమలు, చిరు వ్యాపారుల మనోగతం

తెలంగాణ రాక ముందు, కేసీఆర్ సీఎం కాక ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కరెంట్ కోతలు, తీవ్రమైన విద్యుత్ సంక్షోభం ఉండేది. గాలులు, వర్షాలకు కరెంట్ పోతే రోజుల తరబడి రాకపోయేది. పట్టణాల్లో రోజుకు ఆరు గంటలు, గ్రామాల్లో 8 నుంచి 10 గంటలు మాత్రమే ఉండేది. ఎప్పుడు కరెంట్ వస్తదో.. ఎప్పుడు పోతదో తెలియని దుస్థితి. ఇక పరిశ్రమలకు రోజుకు 10 గంటల కరెంట్ ఇస్తే అదే గొప్ప. తెలంగాణ వచ్చాక 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి వచ్చింది. దీంతో పరిశ్రమల్లో ఉత్పాదకత పెరిగింది. కూలీలకు ఉపాధి దొరికింది. చిరువ్యాపారులకు చేతినిండా పని లభించింది. నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పారిశ్రామిక పెట్టుబడులు పెరిగాయి. ఏం చేసిండో.. ఎవ్వరిని బతిమిలాడిండో.. ఎవ్వరి మెడమీద కత్తి పెట్టిండో తెలియదు. కేసీఆర్ 24 గంటల కరెంట్ ఇచ్చి మంచి పని చేసిండు. ఇప్పుడా ఆ కరెంట్‌పైనే రాజకీయాలు చేయడం సరికాదు. 24 గంటల కరెంట్‌తో మారిన బతుకులు ఎన్నో ఉన్నాయ్. ఎవ్వరెన్నీ రాజకీయాలు చేసినా, కేసీఆర్ మీద నిందలు మోపినా.. మా మనసుల్లో మాత్రం ఆయన మేలు చిరస్థాయిగా ఉంటుంది. ఇప్పుడు కొత్త సర్కారు వచ్చి ఆరున్నర నెలలు కూడా కాకముందే కోతలు మొదలైనయ్. అడపాదడపా కరెంట్ పోతుండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నయ్ అంటున్నారు పరిశ్రమల నిర్వాహకులు, చిరు వ్యాపారులు. వారి అనుభవాలు వారి మాటల్లోనే.. **- మంచిర్యాల, జూన్ 20(నమస్తే తెలంగాణ ప్రతినిధి)**

చీటికీమాటికీ కరెంటు పోతంది

దండేపల్లి, జూన్ 20 : పదేండ్లుగా మా ఊరిలో వెల్డింగ్ దుకాణం నడుపుతున్న. కేసీఆర్ హయాంలో కరెంటు మంచిగా ఉండే. రెప్పపాటు కూడా కరెంట్ తీసేసింది లేదు. మంచిగ దుకాణం నడిపించుకున్నం. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా 24 గంటలు కరెంటిచ్చిన్రు. ఇప్పుడు చీటికీ మాటికీ కరెంటు తీసేస్తున్నరు. దీంతో పనులన్నీ ఆగిపోతున్నయి. గిరాకీ దెబ్బతింటుంది. కరెంటు లేక ఖాళీగా కూర్చోవాల్సి వస్తుంది. కాంగ్రెసోళ్లను నమ్మిన పాపానికి గిట్లా చేస్తరనుకోలే. ఇకనైనా మాలాంటోళ్ల గురించి ఆలోచన చేయాలె. 24 గంటలు కరెంటియ్యాలె. **- కుందారపు రమేశ్, వెల్డింగ్ దుకాణం, తాళ్లపేట**

అప్పుడే వ్యాపారం బాగుండే..

నిర్మల్ అర్బన్, జూన్ 20 : కొన్నేండ్లుగా ప్రింటింగ్ ప్రెస్ నడుపుతున్నా. కేసీఆర్ ప్రభుత్వంలో 24 గంటల కరెంట్ సదుపాయం ఉండే. నిరంతరం ప్రింటింగ్ ప్రెస్ పనులను చేసుకునే వాళ్లం. మా వ్యాపారాలు బాగా నడిచేవి. కరెంట్ పోతుందన్న దిగులు ఉండేది కాదు. ఎప్పుడు దుకాణం తీసినా మిషన్ చాలు చేసి ప్రింటింగ్ పనులు నిర్వహించుకునే వాళ్లం. కాంగ్రెస్ హయాంలో కరెంట్ కోతలు షురూ కావడంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం చిన్నతరహా పరిశ్రమలు నడుపుకునే వారికి ఉచిత విద్యుత్‌ను అందించాలి. **- సంతోష్, ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకుడు, నిర్మల్.**

కోతలు పెరిగాయి..

నిర్మల్ అర్బన్, జూన్ 20 : కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కరెంటు కోతలు పెరిగాయి. కేసీఆర్ ప్రభుత్వంలో నిరంతరం కరెంట్ ఉంటుండే. వ్యాపారాన్ని సజావుగా చేసుకునే వాళ్లం. గతంలో కరెంట్ కోతలు లేకపోవడంతో ఇబ్బంది లేకుండే. ప్రస్తుతం కాంగ్రెస్ హయాంలో చీటికీమాటికీ విద్యుత్ పోతున్నది. మొబైల్ ఫోన్‌లు రిపేరు చేయడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో వ్యాపారం దెబ్బతింటున్నది. ఉచిత విద్యుత్ సంగతి ఏంటో గానీ.. ప్రభుత్వం ప్రజలందరికీ 24 గంటల విద్యుత్ అందించాలి. **- రిజ్వాన్, మొబైల్ దుకాణం నిర్వాహకుడు.**

కరెంటు కష్టాలు మళ్లీ మొదటికి..

గుడిహత్నూర్, జూన్ 20 : కేసీఆర్ పాలనలో నిరంతరం విద్యుత్ సరఫరా ఉండడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు పనులు చేసుకుని హాయిగా ఇంటికి వెళ్లేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియక షాపులో కరెంటు కోసం ఎదురు చూస్తున్నాం. చిన్నపాటి చినుకులు పడినా, గాలివీచినా, ఉరుములు, మెరుపులు వచ్చినా కరెంటు తీసేస్తున్నారు. మళ్లీ ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు. కరెంట్లోళ్లకు ఫోన్ చేస్తే లైన్ బాగా లేదని చెబుతున్నారు. కాంగ్రెస్ పాలన వచ్చాక కరెంటు కష్టాలు మొదటికి వచ్చాయి. నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తున్నామని కాంగ్రెసోళ్ల మాటల్లో నిజం లేదు. కరెంటు విషయంలో కేసీఆర్‌ను మరచిపోలేం. **- ముండె గజానంద్, వెల్డింగ్ షాప్ యజమాని, గుడిహత్నూర్**

కేసీఆర్ హయాంలోనే మంచిగుండే..

బైంసా, జూన్ 20 : కాంగ్రెస్ సర్కారు హయాంలో కరెంటు కోతలు విపరీతంగా ఉంటున్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో నిరంతరం కరెంటు ఉంటే.. కాంగ్రెసోళ్లు 14 గంటలు మాత్రమే ఇస్తున్నారు. నేను బైంసా పట్టణంలో వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తాను. నిరంతరం కరెంటు ఉంటే రోజూ రూ.1000లు దొరికేవి. మంచిగా బతికేవాళ్లం. గిప్పుడు కరెంటు కోతల వల్ల పని కావడం లేదు. ఎవరైనా ఆర్డర్ ఇస్తే ఒక్క రోజులో అయ్యే పని రెండు, మూడు రోజులు పడుతున్నది. ఇలాగైతే ఎట్లా పనిచేస్తం. బతుకుడు ఎలా బతుకుతం. **- ఎండీ షోయబ్, వెల్డింగ్ మెకానిక్, బైంసా.**

ఎస్పీగా శ్రీనివాస్‌రావు బాధ్యతల స్వీకరణ

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 20 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా నూతన ఎస్పీగా శ్రీనివాస్‌రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. మేడ్చల్ జిల్లా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ డీసీపీగా పనిచేసిన డీ.వీ శ్రీనివాస్‌రావు ఇటీవల బదిలీల్లో ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌తో శాంతిభద్రతల పరిరక్షణ తదితర అంశాలపై చర్చించారు.

కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రావు

నులిపురుగుల నివారణకు కృషి చేయాలి

ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్,జూన్20 : నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జిల్లా వైద్య శాఖ అధికారి తుకారాంభట్‌తో కలిసి నులిపురుగుల నివారణ మాత్రలు విద్యార్థులకు అందించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 19 ఏళ్లలోపు వారు 1,73,494 మంది ఉన్నారని, వీరందరికీ మాత్రలు అందిస్తామన్నారు. చెప్పులు లేకుండా నడువడం, మట్టిలో ఆడుకోవడం, బలపాలు, మట్టి తినడం వల్ల పిల్లల శరీరంలో నులిపురుగులు తయారవుతాయని తెలిపారు. ఇవి పేగుల్లో ఉండి రక్తాన్ని పీల్చుకుంటాయని, ఫలితంగా పిల్లల్లో రోగ నిరోధక శక్తి లోపించి ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. మాత్రలు వేయడం వల్ల నులిపురుగులు బయటకు పోతాయన్నారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థికి నులిపురుగుల నివారణ మాత్ర వేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం
మరియు
- అన్ని శుభకార్యాలు
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679